క్లుప్తంగా

లోక్ అదాలత్‌లో ఎనిమిది కేసుల పరిష్కారం


అదనపు జడ్జి అన్నపూర్ణ

కొవ్వూరు: ప్రత్యేక లోక్ అదాలత్‌లో ఎనిమిది కేసులను పరిష్కరించినట్టు జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి పి.అన్నపూర్ణ తెలిపారు. మండల లీగల్ సర్వీసెస్ ఆథారిటీ ఆధ్వర్యంలో కొవ్వూరు కోర్టులో శనివారం ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించారు. మనోవర్తి కేసు ఒకటి, వరకట్న వేధింపుల కేసులు ఐదు, ప్రీ లిటికేషన్ మనోవర్తి కేసు ఒకటి,ఓపీ కేసు మరొకటి పరిష్కరించినట్టు ఆమె వివరించారు. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు, సెకండ్ అడిషనల్ అండ్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కె.శారదాంబ తదితరులు సిట్టింగ్ బెంచ్‌లకు జడ్జీలుగా వ్యవహరించారు.

స్ఫటిక లింగ దర్శనం ప్రారంభం


అన్నవరప్పాడులో స్ఫటిక లింగ దర్శనం చేసుకుంటున్న భక్తులు

పెరవలి: మండలంలోని అన్నవరప్పాడులో జాతీయ రహదారి పక్కనే కొలువైన ఉమావిశ్వేశ్వర స్వామివారి ఆలయం ప్రాంగణంలో స్ఫటిక లింగం ప్రతిష్ఠ జరిగి ఏడాదైంది. ఈ క్రమంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునే స్ఫటిక లింగానికి ప్రత్యేకంగా అభిషేకం నిర్వహించాక, భక్తులకు దర్శనం కల్పించారు. వందలాది భక్తులు వచ్చి స్ఫటిక లింగాన్ని తాకారు. ఈ స్ఫటిక లింగ దర్శనం ఉగాది వరకూ ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

నవోదయ ఎంట్రన్స్ స్టడీ మెటీరియల్ అందజేత

తాళ్లపూడి: నవోదయ ప్రవేశ పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులకు మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ శనివారం స్టడీ మెటీరియల్ అందజేసింది. నవోదయ పాఠశాల ఐదో తరగతిలో ప్రవేశానికి ప్రిపేరవుతున్న 25 మంది విద్యార్థులకు రూ.మూడు వేల విలువైన పుస్తకాలను అందజేశారు. ప్రక్కిలంక పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆ సంస్థ మండల శాఖ అధ్యక్షుడు జె.వెంకటేశ్వరరావు స్టడీ మెటీరియల్ పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు.ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాస్, బి. విజయబాబు, రాము తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

దేవరపల్లి: తమ సమస్యలను పరిష్కరించాలని మండలంలోని విశ్రాంత ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరారు. మండల విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగులు శనివారం దేవరపల్లిలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ కార్యదర్శి బండి సూర్యప్రకాశరావు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు మందులు లేకుండా పూట గడవని పరిస్థితిలో ఉన్నారన్నారు. ప్రభుత్వం ప్రతినెలా ఒకటో తేదీన పెన్షన్ చెల్లించాలని, జూలై 2018 నుంచి ఇవ్వవలసిన డీఏ, 2020 నుంచి చెల్లించాల్సిన పీఆర్సీ బకాయిలను చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఈహెచ్ఎస్ కార్డులపై నగదు రహిత వైద్యం అందించాలని, అడిషినల్ క్వాంటం ఇక్రిమెంట్లు పాత శ్లాబ్‌లను పునరుద్ధరించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సంఘాధ్యక్షుడు సయ్యద్ ఆలీ, మాజీ అధ్యక్షులు పప్పు వెంకట రామారావు, కోశాధికారి యలమాటి సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శి ఈడ్పుగంటి నాగేశ్వరరావు, పలువురు విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

కొవ్వూరు: ఇటీవల రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన మండలంలోని ఐ.పంగిడి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు తోట దుర్గారావు కుటుంబబ సభ్యులను శనివారం పలువురు నాయకులు పరామర్శించారు. దుర్గారావు చిత్ర పటానికి పూలు వేసి నివాళులు అర్పించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, దొమ్మేరు సొసైటీ అధ్యక్షుడు ముదునూరి నాగరాజు, ఉప సర్పంచ్ ఉప్పులూరి వెంకట ఫణి కృష్ణారావు(నానాజీ), నాయకులు వరిగేటి సుధాకర్, రుద్రం వీరబాబు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

తహసీల్దార్ కోర్టులో నలుగురి బైండోవర్

కొవ్వూరు: సారా కేసుల్లో నిందితులైన నలుగురిని శనివారం తాళ్లపూడి తహసీల్దార్ కోర్టులో బైండోవర్ చేసినట్టు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వీటీవీ సత్యనారాయణ తెలిపారు. తాళ్లపూడి మండలంలోని అన్నదేవరపేటకు చెందిన కాయిత రమణ, తిరుగుమెట్టకు చెందిన వడ్లమూడి గణపతి మణికంఠ, తుపాకులగూడేనికి చెందిన శీలబోయిన సత్యనారాయణ, వేగేశ్వరపురానికి చెందిన కారింకి వెంకట సత్యనారాయణమూర్తిలను బైండోవర్ చేసినట్టు ఆయన వివరించారు.

అకాల ముసురు.. అన్నదాతల్లో గుబులు

- డివిజన్ వ్యాప్తంగా చెదురుమదురు వర్షం
- ఈదురు గాలులు వీస్తే పంటలకు ముప్పే
- రైతులు జాగ్రత్తలు వహించాలంటున్న అధికారులు


కొవ్వూరులో వర్షం ఇలా..


పెరవలి మండలం కాపవరంలో ఈనిక దశలో ఉన్న వరి పైరు

కొవ్వూరు: మండుటెండల వేళ.. కురుస్తున్న అకాల వర్షం అన్నదాతలను కలవర పరుస్తోంది. చెదురుమదురుగా కురుస్తున్న ప్రస్తుత వర్షాలతో పంటలకు ఏమాత్రం నష్టం లేదు. అయితే పొరుగునే ఉన్న తెలంగాణ రాష్ట్రంలో వడగళ్ల వానలుపడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయంటూ వాతావరణ చేసిన హెచ్చరికలతో రైతులు అప్రమత్తం అయ్యారు. బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో శనివారం కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా చెదురుమదురు వర్షం కురిసింది. వర్షాలకు తోడు ఈదురుగాలులు తోడైతే మాత్రం పంటలకు నష్టం తప్పదని రైతులు పేర్కొంటున్నారు. ఆకాశం మేఘావృతం కావడంతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. డివిజన్‌లో దాదాపు అన్నీ మండలాల్లోనూ శనివారం సాయంత్రం నుంచి చినుకులు పడుతూనే ఉన్నాయి. దీంతో ప్రజలు ఇళ్లకే పరిమితం అయ్యారు. కొవ్వూరు, తాళ్లపూడి, చాగల్లు మండలాల్లో శనివారం మధ్యాహ్నం నుంచి ఓ మోస్తరు వర్షం పడింది. గోపాలపురం, తాళ్లపూడి, కొవ్వూరు, ఉండ్రాజవరం మండలాల్లో అక్కడక్కడా వర్షం కురిసింది. ఇక నల్లజర్ల, గోపాలపురం, దేవరపల్లి, నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం మండలాల్లోనూ చెదురుమదరుగా వర్షం పడింది. శుక్రవారం పెరవలి మండలంలో ఓ మోస్తరు వర్షం కురిసింది.

వడగళ్ల వానలతో ఆందోళన

కొవ్వూరు డివిజన్‌లో ప్రస్తుతం రబీ వరి పంట పాలు పోసుకునే దశ నుంచి గింజ గట్టిపడే దశలో ఉంది. ఇప్పటికే పక్వానికి వచ్చిన ఆర్ఎస్ఆర్-15048 రకం వరి పంటను ఒక వేళ రైతులు ఇప్పటికే కోసి ఉంటే వర్షానికి తడవకుండా సురక్షిత ప్రాంతాలకు చేర్చుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. కోతకు ఇంకా సమయం ఉన్నందున ఎంటీయూ 1121 అనే రకం వరి వంగడానికి అంతగా ఇబ్బంది ఉండదన్నారు. ఒకవేళ అధిక వర్షాలు కురిస్తే మాత్రం పొలంలో డ్రైయినేజీ సదుపాయం ఏర్పాటు చేసుకుని నీటిని బయటికి పంపుకోవాలని సూచిస్తున్నారు. వడగళ్ల వాన కురిస్తే వరి, కూరగాయల పంటలతో పాటు మెట్ట ప్రాంతంలో విస్తారంగా సాగయ్యే మామిడి పంటపై కూడా తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. మామిడికాయల నాణ్యత దెబ్బతినడమే గాకుండా, ఈదురు గాలులు వీస్తే పంట రాలిపోయే ప్రమాదం ఉందని మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. కూరగాయల పంటలకు పెద్దగా నష్టం లేకపోయినప్పటికీ గాలుల తీవ్రత పెరిగితే పందిళ్లు కూలిపోవచ్చని చెబుతున్నారు. అరటి పంట ప్రస్తుం కోత దశలో ఉన్నాయి.ఈ తరుణంలో గాలి వీస్తే చెట్లు కూలిపోయే ప్రమాదం ఉంది. దీంతో ముందుస్తుగా అరటిచెట్లకు వెదురు గెడలతో సపోర్టులు ఏర్పాటు చేసుకోవడం మంచిదని ఉద్యాన శాఖ అధికారులు సూచిస్తున్నారు.

ఇటుక బట్టీలపై ప్రభావం

పెరవలి, తాళ్లపూడి, కొవ్వూరు మండలాల్లో నిర్వహిస్తున్న ఇటుక బట్టీలపై ఈ ముసురు కొంత ప్రతికూల ప్రభావం చూపింది. శుక్రవారం కురిసిన వర్షానికి చాలా బట్టీల్లో పచ్చి ఇటుకల తడిసిపోవడంతో నిర్వాహకులకు పాక్షికంగా నష్టం వాటిల్లింది. శనివారం కూడా వర్షం కురవడంతో పనులను నిలిపి వేశారు. ఇప్పటివరకూ తయారు చేసి పచ్చి ఇటుకలపై బరకాలు కప్పి ఉంచారు. భారీ వర్షాలు కురిస్తే నష్టం తీవ్రత అధికంగా ఉంటుందని చెబుతున్నారు.

డెల్టా ఆయకట్టుకు ఊరట

కొవ్వూరు: గోదావరి డెల్టా ఆయకట్టు పరిధిలోని పెరవలి, ఉండ్రాజవరం మండలాలతో పాటు నిడదవోలు మండలంలోని కొంత ఏరియాకు ఈ వర్షం ఊరట కలిగించింది. ఈ మూడు మండలాల్లో 16,338 హెక్టార్ల విస్తీరణంలో రబీ వరి సాగవుతోంది. ఇందులో గోదావరి డెల్టా ఆయకట్టు పరిధిలో 15 వేల హెక్టార్ల ఆయకట్టు ఉంది. గోదావరి నదిలో నీటిమట్టం బాగా పడిపోయిన ప్రస్తుత తరుణంలో ఈ వర్షం రైతులకు మేలు చేసింది. పంటలు ఎండిపోకుండా ఆదుకుంది. ఎత్తిపోతల పథకాల ఆయకట్టు కింద సాగు చేస్తున్న తాళ్లపూడి, కొవ్వూరు మండలాల్లో కూడా గోదావరి నది నుంచి చాలినంతగా తడులు అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రెండు మండలాల్లో సుమారు 8,694 ఎకరాల విస్తీర్ణంలో ఖరీఫ్ వరి సాగు చేస్తున్నారు. ఈ వర్షంతో నీటి తడుల ఇబ్బందులు తొలగాయని రైతులు చెబుతున్నారు.

రైతుల్లో తెగుళ్ల భయం

పెరవలి: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు తగ్గిన తరువాత వరి పైరుకు దోమపోటు అధికంగా ఉంటుందని రైతులు భయపడుతున్నారు. అదే సమయంలో ఇతర తెగుళ్ల వ్యాప్తి కూడ ఎక్కువగా ఉండొచ్చని చెబుతున్నారు. అవే జరిగితే పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుందంటున్నారు. వర్షానికి బరువెక్కి కోతకు సిద్ధంగా ఉన్న వరిపైరు నేలను అంటి, గింజలు రాలిపోయే అవకాశం ఉంటుందంటున్నారు. అప్పుడు కూడ దిగుబడి తగ్గుతుందని రైతులు లెక్క వేస్తున్నారు. వర్షాల వల్ల కూరగాయల పంటలకు కూడ తెగుళ్లు వ్యాపిస్తాయని చెబుతున్నారు. అలాగే పందిరి కూరగాయల పంటలకు పూత, పిందె రాలిపోయి, దిగుబడి పడిపోతుందంటున్నారు. ఇక పూచిన పూలు రాలిపోతాయని, మొగ్గలు వర్షాలకు కుళ్ళిపోయి పూలసాగుదారులకు నష్టం వస్తుందని చెబుతున్నారు. ఈ వర్షాలు దీర్ఘకాలిక పంటలైన కంద, అరటి, చెరకు, కోకో వంటి పంటలకు మేలు చేస్తుందని మండల రైతులు తెలిపారు.

పొగాకు రైతులను వణికిస్తున్న వర్షాలు

దేవరపల్లి: అకాల వర్షాలు పొగాకు రైతులను వణికిస్తున్నాయి. రెండు రోజులుగా మెట్ట ప్రాంతంలోని పలు ప్రాంతాల్లో చెదురుమదురు వర్షాలు కురుస్తున్నాయి. శనివారం మధ్యాహ్నం నుంచి ఆకాశం మేఘావృతమై వర్షపు జల్లులు పడుతున్నాయి. ప్రస్తుతం పొగాకు రెలుపులు జరుగుతున్నాయి. పొగాకు రంగు, నాణ్యత బాగున్న తరుణంలో అకాల వర్షాలకు తోటలు దెబ్బతింటాయని రైతులు వాపోతున్నారు. ముదర తోటలు మరొక మూడు, నాలుగు రెలుపులు అవుతాయని, లేత తోటలు మే నెల వరకూ రెలుపులు జరుగుతాయని దేవరపల్లి పొగాకు వేలం రైతు సంఘం అధ్యక్షులు కరుటూరి శ్రీనివాస్ తెలిపారు. వర్షాలు ఎక్కువైతే తోటల్లోని ఆకు నాణ్యత దెబ్బతింటుందని, భూమిలోని ఎరువు మొక్క పూర్తిగా ఒకేసారి తీసుకోవడం వల్ల గుల్లబారి క్యూరింగ్ అనంతరం దిగుబడి, నాణ్యత తగ్గుతుందని ఆయన వివరించారు. ఈ వర్షాలు ఇంతటితో తగ్గితే పర్వాలేదని, ఎక్కువైతే నష్టం తప్పదని ఆయన తెలిపారు. అలాగే కళ్లాల్లోని ఎండుమిరపకాయలు వర్షాలకు తడిచి నాణ్యత దెబ్బతింటుందని రైతులు తెలిపారు.

కె.సావరంలో హౌసింగ్ డే

ఉండ్రాజవరం: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఎ.శ్రీనివాసు సిబ్బందికి సూచించారు. కె.సావరం గ్రామంలోని జగనన్న కాలనీలో శనివారం గృహనిర్మాణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ లబ్ధిదారులకు ప్రభుత్వం తరపున వెంటనే బిల్లులు మంజూరు చేస్తామన్నారు. హౌసింగ్ ఏఈ విక్టర్ బాబు మాట్లాడుతూ కె.సావరం జగనన్న కాలనీలో అర్హులకు ప్రభుత్వం 106 ఇళ్లు మంజూరు చేసిందన్నారు. అయితే ఇంతవరకూ 35 మంది లబ్ధిదారులు మాత్రమే ఇళ్లను నిర్మిస్తున్నారని, మిగిలిన 71 మంది మాత్రం ఇప్పటికీ పనులు ప్రారంభించలేదన్నారు. ఈఓపీఆర్డీ ముత్యం వీరాస్వామినాయుడు మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణం చేపట్టని వారిని చైతన్య పరచడానికి, ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసేందుకు ఈ సమావేశాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నార్ని రామకృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికి నిధుల కేటాయింపు దుర్వినియోగమా?

- టీడీపీ నాయకుడు వెంకట్రాజుకు ఎమ్మెల్యే తలారి ప్రశ్న



దేవరపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన ప్రజా సంక్షేమ బడ్జెట్‌పై టీడీపీ గోపాలపురం నియోజక వర్గ కన్వీనర్ మద్దిపాటి వెంకట్రాజుకు అవగాహన లేదని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. శనివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలను పరిష్కరించడానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యత ఇచ్చి నిధులు మంజూరు చేశారన్నారు. గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు బడ్జెట్‌లో రూ.532 కోట్లు కేటాయించడం సొంత ప్రచారం అవుతుందా? అని తలారి ప్రశ్నించారు. గడపగడపకూ కార్యక్రమంలో ప్రతి గ్రామ సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున మంజూరు చేసి అభివృద్ధి పనులు చేస్తున్నట్టు తెలిపారు. టీడీపీ ప్రభుత్వంలో ప్రచార కార్యక్రమాలకు కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని ఆయన ఆరోపించారు. పార్టీ కన్వీనర్ మద్దిపాటికి బడ్జెట్‌పై అవగాహన లేకపోవడం సిగ్గుచేటని తలారి అన్నారు.

సర్వే పనులకు సహకరించాలి


కె.సావరంలో స్వామిత్వ సర్వేను పరిశీలిస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ సర్వే లక్షణరావు

ఉండ్రాజవరం: ప్రభుత్వం చేపట్టిన భూములు, ఇళ్ల సర్వేకు ప్రజలు అధికారులకు సహకరించాలని అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ సర్వే పూజారి లక్షణరావు సూచించారు. మండలంలో కె.సావరం గ్రామంలో నిర్వహించిన స్వామిత్వ సర్వే పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, ఇళ్ల యజమానులకు ఎలాంటి ఖర్చు లేకుండా తమ భూములు, ఇళ్లపై చట్టపరమైన యాజమాన్య పత్రాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ కె.నాగేంద్ర, ఈఓపీఆర్డీ ముత్యం వీరాస్వామినాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు 93 మంది గైర్హాజరు

కొవ్వూరు: డివిజన్ పరిధిలోని 15 పరీక్ష కేంద్రాల్లో శనివారం నిర్వహించిన ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లిషు పరీక్షకు 4678 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 4,771 మంది విద్యార్థులకు గాను 93 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 4,099 మంది ఉండగా వారిలో 58 మంది గైర్హాజరు కాగా 4,041 మంది పరీక్ష రాశారు. ఒకేషనల్ కేటగిరీలో 672 మంది ఉంటే 35 మంది గైర్హాజరు కాగా 637 మంది పరీక్షకు హాజరయ్యారు. కొవ్వూరులోని మూడు పరీక్ష కేంద్రాల్లో శనివారం పది మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 206 మందికి ముగ్గురు గైర్హాజరు కాగా 203 మంంది పరీక్ష రాశారు. చైతన్య కళాశాలలో 234 మందికిగాను 231మంది, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో 258కి గాను 254 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఇంగ్లిషు పరీక్ష రాశారు.

ఎస్సీలు అదనపు యూనిట్ల బిల్లు చెల్లించాల్సిందే

- ఈఆర్ఓ అనంతలక్ష్మి


ఘంటావారిగూడెంలో ఎస్సీ వినియోగదారులతో మాట్లాడుతున్న ఈఆర్ఓ అనంతలక్ష్మి

నల్లజర్ల: రెండు వందల యూనిట్లకు మించి విద్యుత్తు వాడిన ఎస్సీ వినియోగదారులు అదనపు బిల్లు చెల్లించాల్సిందేనని ఏఏఓ.ఈఆర్ఓ (తాడేపల్లిగూడెం) స్పష్టం చేశారు. మండలంలోని ఘంటావారిగూడెం గ్రామ సచివాలయంలో ఎస్సీ విద్యుత్తు వినియోగదారులతో శనివారం ఆమె సమావేశమయ్యారు. అల్పాదాయవర్గాలైన ఎస్సీలు మినహా కారు, భూమి, పక్కా గృహం ఉన్నా, ఉద్యోగులైనా, ఇన్‌కంటాక్స్ చెల్లిస్తున్న ఎస్సీలు విద్యుత్ బిల్లు తప్పక చెల్లించాలన్నారు. తాడేపల్లిగూడెం డివిజన్ పరిధిలో ఒక్క నల్లజర్ల మండలం అందులోనూ ఒక్క ఘంటావారిగూడెం గ్రామంలో రూ.3 లక్షలకు పైగా ఎస్సీ విద్యుత్ బకాయిలు పేరుకు పోయాయన్నారు. ఎస్సీ వినియోగదారులు కూడా సబ్సిడీ పోను తాము వినియోగించుకున్న విద్యుత్‌కు బిల్లులు చెల్లించాల్సిందేనన్నారు. బిల్లులు ఎక్కువ చెల్లించాల్సిన ప్రాంతాలలో స్పెషల్ డ్రైవ్‌ల ద్వారా బకాయిల వసూలు కార్యక్రమం చేపడుతున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ నల్లజర్ల ఏడీఏ రాజబాబు, నల్లజర్ల లైన్ ఇన్‌స్పెక్టర్ ఈదా డేవిడ్, విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

రుచికరంగా భోజనం అందించాలి


డి ముప్పవరం ఎంపీ యూపీ స్కూల్ విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి తదితరులు

నిడదవోలు రూరల్: విద్యార్థులకు రుచికరంగా మధ్యాహ్న భోజనాన్ని అందించాలని ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి సూచించారు. మండలంలోని డిముప్పవరం గ్రామంలోని ఎంపీ యూపీ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం ఆమె సందర్శించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు-నేడు పథకంలో పాఠశాలల రూపురేఖలను మార్చి విద్యాభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భాగ్యలక్ష్మి భోజనం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగిరెడ్డి నాగదేవి, ఎంపీటీసీ సభ్యుడు తంగినీడు సత్యనారాయణ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ బట్టు భీమారావు, ఎంఈవో కిషోర్, వైఎస్సార్ సీపీ నాయకులు నాగిరెడ్డి సత్తిపండు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

వేద మార్గంలో సనాతన ధర్మం

- కంచి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి


వేంకటేశ్వరుని సన్నిధిలో సనాతన ధర్మాన్ని వివరిస్తున్న కంచి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి

దేవరపల్లి: సనాతన ధర్మం వేద మార్గంలో నడుస్తోందని కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామీజీ అన్నారు. దేవరపల్లిలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారిని శనివారం రాత్రి ఆయన దర్శించుకున్నారు. అమ్మవార్లకు పూజలు చేసి హారతి ఇచ్చారు. శ్రీవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. వేద మంత్రాలతో స్వరం మారకుండా పూజలు చేయాలన్నారు. అందుబాటులో ఉన్న పుష్పాలను భగవంతునికి సమర్పించి భక్తితో అహంకారం లేకుండా పూజలు చేయాలన్నారు. గోదావరి జిల్లాల్లో తన విజయయాత్రలో భాగంగా దేవరపల్లి వచ్చినట్టు తెలిపారు. ధర్మం అతి పురాతనమైనదన్నారు. ధర్మం వల్ల మంచి పర్యావరణం ఏర్పడుతుందని తెలిపారు. రాత్రి 9 గంటలకు దేవరపల్లి విచ్చేసిన పీఠాధిపతికి గ్రామస్తులు, భక్తులు ఘన స్వాగతం పలికారు. స్థానిక ఆది శంకరాచార్యులు మందిరాన్ని, పార్వతీ సమేత ఉమా రామలింగేశ్వరస్వామి వారి ఆలయాలను సందర్శించి పూజలు చేశారు. వేంకటేశ్వరస్వామి వారి ఆలయం వద్ద వేదపండితులు, ఆలయ కమిటీ సభ్యులు పీఠాధిపతులు విజయేంద్ర సరస్వతికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

స్కూల్‌కు డుమ్మా కొడితే ఇంటికి మెసేజ్

- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరుపై నిరంతర పర్యవేక్షణ
- రోజూ పాఠశాలకు వెళ్లేలా హాజరు మెసేజ్ అలర్ట్
- ప్రభుత్వ చర్యలతో తల్లిదండ్రులు హర్షం


బ్రాహ్మణగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు

చాగల్లు: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల హాజరు పెంచేలా ప్రభుత్వం తాజాగా అమలు చేసిన మొబైల్ అలర్ట్ సందేశం విధానానికి మంచి స్పందన లభిస్తోంది. 'నాడు-నేడు' పథకంతో ఇప్పటికే ప్రభుత్వ బడులు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా రూపుదిద్దుకున్నాయి. విద్యార్థులకు అవసరమైన సామగ్రిని సమకూర్చి మెనూ ప్రకారం రోజూ మధ్యాహ్న భోజనం అందిస్తోంది. 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను అందించి బైజూస్ కంటెంట్‌తో బోధన ప్రారంభించింది. తాజాగా విద్యార్థులు సక్రమంగా పాఠశాలకు వస్తున్నారా? లేదా అన్న అంశంపై ప్రత్యేక దృష్టి సారించింది. విద్యార్థులు పాఠశాలకు వెళ్లకపోతే తల్లిదండ్రుల మొబైల్‌కు సందేశం పంపేలా చర్యలు తీసుకుంది.

పాఠశాలకు డుమ్మా కొట్టే విద్యార్థులకు ఇక చెక్ పెట్టినట్టే. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మొబైల్ అలర్ట్ సందేశంతో తల్లిదండ్రులు పిల్లలను గాడిలో పెడుతున్నారు. చాగల్లు మండలంలో 39 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. అందులో సుమారు 4,600 మంది విద్యార్థులు చదువుతున్నారు. వారందరూ వంద శాతం హాజరై తద్వారా అమ్మ ఒడి పథకాన్ని అందుకోవాలన్న ఉద్దేశంతో ఈ విధానానికి ప్రభుత్వం రూపకల్పన చేసింది. కొన్ని సందర్భాల్లో పిల్లలు ఇంటి నుంచి పాఠశాలకు వెళ్తున్నామని చెప్పి డుమ్మా కొడుతుంటారు. ఇలాంటి సందర్భంలో విద్యార్థి పాఠశాలకు హాజరు కాలేదంటూ వారి తల్లిదండ్రుల మొబైల్‌కు సందేశం వెళుతుంది. ప్రభుత్వం కొత్తగా అమలు చేసిన ఈ విధానంపై తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సమయం దాటినా రాకుంటే....

విద్యార్థులు ఉదయం 10.30 గంటల్లోపు పాఠశాలకు హాజరు కాకపోతే మీ అమ్మాయి, అబ్బాయి ఈ రోజు పాఠశాలకు హాజరు కాలేదంటూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ పేరుతో ఆయా తల్లిదండ్రులకు నేరుగా మొబైల్ సందేశం చేరుతుంది. దీనికోసం ముందుగా విద్యార్థుల తల్లిదండ్రులు లేదా సంరక్షకుడి మొబైల్ నంబర్, ఆధార్ నంబర్‌ను సేకరించి సీఎస్ ఈ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. వరుసగా మూడు రోజుల పాటు పాఠశాలకు హాజరుగాక పోతే తల్లిదండ్రులతో పాటు ఆ ప్రాంత గ్రామ వలంటీర్, సచివాలయ వెల్ఫేర్ సహాయకుడికి ఈ మెసేజ్ చేరుతుంది. దీంతో వలంటీర్, వెల్ఫేర్ అసిస్టెంట్ హెచ్ఎంతో కలిసి విద్యార్థి ఇంటికెళ్లి పాఠశాలకు ఎందుకు రావడం లేదన్న విషయాన్ని అడిగి తెలుసుకుంటారు. ఇలా రూపొందించిన ఈ పథకం సత్ఫలితాలను ఇస్తోంది. ఈ కారణంగా బడి బయట విద్యార్థులను పాఠశాలలో చేర్పించిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. విద్యారంగంపై ప్రభుత్వ శ్రద్ధ వహిస్తోందనేందుకు ఇదే నిదర్శనమని తల్లిదండ్రులు చెబుతున్నారు.


ఈ విధానంతో ఎంతో మేలు



విద్యార్థులు పాఠశాలకు వెళ్లకపోతే వారి తల్లిదండ్రుల ఫోన్‌కు సమాచారం చేరవేసే విధానం ఎంతో మంచిది. దీనివల్ల పాఠశాలలో వంద శాతం హాజరు అమలవుతుంది. కొన్ని సందర్భాల్లో విద్యార్థి పాఠశాలకు వెళ్లకుండా ఉంటే తల్లిదండ్రులకు వెంటనే తెలుస్తోంది. బాలికల విషయంలో ఈ విధానం ఎంతో ఉపయోగకరం. విద్యార్థుల విద్యపై శ్రద్ధ చూపుతున్న ప్రభుత్వం పట్ల ప్రజల్లో నమ్మకం ఏర్పడింది.

– కె. కాంతారావు, పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు, బ్రాహ్మణగూడెం

హాజరు శాతం మరింత మెరుగు



ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం ఆన్‌లైన్ అటెండెన్స్ అమలు చేస్తోంది. ఇప్పుడు విద్యార్థులు పాఠశాలకు వెళ్లకపోతే తల్లిదండ్రులకు సందేశం వెళ్లే కొత్త విధానాన్ని తీసుకొచ్చింది. దీనివల్ల హాజరు శాతం మెరుగవుతోంది. విద్యార్థులు పాఠశాలకు ఎందుకు రాలేదో వెంటనే తెలుస్తోంది. బడి బయట పిల్లలు మళ్లీ బడికి వస్తున్నారు

– వి.ఖాదర్‌బాబు, ఎంఈవో, చాగల్లు

20, 21 తేదీల్లో ఆధార్ శిబిరాలు

నిడదవోలు రూరల్: ఆధార్ నమోదు ప్రక్రియలో భాగంగా నూరు శాతం బయోమెట్రిక్ లక్ష్యంతో ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలు నిర్వహిస్తున్నామని ఎంపీడీవో పి.మూర్తిబాబు శనివారం తెలిపారు. ఈనెల 20న కంసాలిపాలెం, డి.ముప్పవరం, 21న కంసాలిపాలెం, మునిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద ఈ ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలు జరుగుతాయని, స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కోడి పందేలపై పోలీసుల దాడి

నల్లజర్ల: మండలంలోని తెలికిచెర్ల గ్రామశివార్లలో నిర్వహిస్తున్న కోడి పందేలపై శనివారం సాయంత్రం నల్లజర్ల పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో తొమ్మిది మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.4200 నగదు స్వాధీనం చేసుకున్నారు. అలాగే 18 బైక్‌లు, రెండు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నట్టు నల్లజర్ల ఎస్ఐ నరసింహమూర్తి తెలిపారు.

ఎమ్మెల్సీ శ్రీనివాస్‌ను అభినందించిన జెడ్పీటీసీ

నిడదవోలు రూరల్: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్‌ను నిడదవోలు జెడ్పీటీసీ కొయ్యే సూరిబాబు, తాళ్లపాలెం ఎంపీటీసీ సభ్యుడు బయ్యే కృష్ణబాబులు శనివారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఏలూరులో జరిగిన జెడ్పీ స్థాయి సంఘ సమావేశానికి హాజరైన సూరిబాబు ఎమ్మెల్సీని కలిశారు.